అస్పష్ట జాబితాలు.. ఆవేదనలో అన్నదాతలు

జాబితా విడుదలలో జాప్యం.. అరకొర సమాచారం

బ్యాంకుల వద్ద పడిగాపులు..

సందేహాలపై బ్యాంకర్ల మౌనం



# అయోమయం గందరగోళం

## ఆందోళనలో రైతాంగం



నిజామాబాద్ జిల్లా బోర్గాం (కే)లో ఇండియన్ బ్యాంకు వద్దకు తరలివచ్చిన రైతులు

**రాష్ట్ర ప్రభుత్వం** *గురువారం ప్రారంభించిన రుణమాఫీ ప్రక్రియపై గందరగోళం నెలకొన్నది. ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలు రైతులకు అయోమయానికి గురిచేస్తున్నాయి. లక్షలోపు రుణాలన్నీ మాఫీ చేస్తున్నామని ప్రకటించినప్పటికీ చాలా మంది రైతులకు లక్షలోపు రుణాలు ఉన్నా మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రేషన్‌కార్డులు లేని వారిలో కూడా అయోమయ పరిస్థితి నెలకొన్నది. ఎవరెవరికి వస్తాయి, ఎప్పుడు వస్తాయని కొందరు రైతులు, ఇచ్చుడు స్టార్టయ్యింది మాకు కూడా వస్తాయని మరికొందరు రైతులు ఆశాభావంతో ఉన్నారు. ఏది ఏమైనా రుణమాఫీ విషయంపై రైతుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా చాలా మంది రైతులు రుణమాఫీ వచ్చిందా లేదా అని బ్యాంకులకు వెళ్లి చెక్ చేయించుకుంటున్నారు.*

*–మోర్తాడ్/ ఖలీల్‌వాడి, జూలై 19*

**కమ్మర్‌పల్లికి చెందిన** సంత రాజేశ్వర్ అనే రైతుకు రేషన్‌కార్డు లేదు. రేషన్‌కార్డు విషయంలో రుణమాఫీకి సంబంధించి అధికారులు ఎవరూ విచారణకు రాలేదు. ఆయన భార్య మల్లు పేరుమీద దక్కన్‌గ్రామీణ బ్యాంకులో రూ.99వేల రుణం ఉంది. అది మాఫీ కాలేదు. సంత రాజేశ్వర్ పేరున ఆంధ్రాబ్యాంకులో రూ.2లక్షల రుణం ఉంది. కుటుంబంలో ఇద్దరికి కలిపి దాదాపు రూ.3లక్షల రుణం బ్యాంకుల్లో ఉన్నది.



ఇప్పుడు వీరు మాకు రుణమాఫీ వస్తుందా లేదా అనే సందిగ్ధంలో ఉన్నారు. లక్షలోపు వస్తే తన భార్యకు రావాల్సి ఉండేదని, కుటుంబానికి రూ.2లక్షలు ఇస్తే మొత్తంగా రెండులక్షలు వస్తుందని ఆశిస్తున్నారు. ఏది ఏమైనా రుణమాఫీ ప్రక్రియలో అస్పష్టత, అరకొర సమాచారం, ఎన్నో అనుమానాలు ఉన్నాయని, చివరకు రుణమాఫీ వస్తుందన్న ఆశ వారిలో నెలకొన్నది.

### రూ.44వేల రుణం మాఫీకాలే..



నేను 2023 జూలైలో లోన్ రెన్యువల్ చేసి రూ.44వేల అప్పు తీసుకున్నా. నాకు రుణమాఫీ అవుతుందని ఆశగా ఎదురుచూసిన. మా ఊళ్ల కొంతమందికి మాఫీ అయ్యింది. కానీ నాకు కాలేదు. ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆదుకోవాలి.

**- శేషాబాయి, మల్లాపూర్**

### అయోమయంగా ఉంది..



నేను లక్ష రూపాయలలోపు రుణం తీసుకున్నా.. కానీ నాకు రుణమాఫీ కాలేదు. నాకు రుణమాఫీ ఇస్తారో ఇవ్వరో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. కొందరేమో రెండో విడుతలో వస్తుందని అంటున్నారు. అంతా అయోమయంగా ఉన్నది.

**- ఎర్రోళ్ల సాయిలు, సిర్పూర్, మోపాల్ మండలం**

### బ్యాంకుల వద్ద అన్నదాతల పడిగాపులు

భీమ్‌గల్, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడుతలో లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసినట్లు గురువారం ప్రకటించడంతో మండలంలోని రైతులు బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. కొందరు రైతులు శుక్రవారం ఉదయమే బ్యాంకుల వద్దకు వచ్చి గోడలపై ప్రదర్శించిన జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలియక ఆందోళన చెందారు. బ్యాంకు వద్దకు వచ్చిన యువకులను జాబితాలో తమ పేరు ఉందేమోనని, చూసిపెట్టాలని ప్రాధేయపడ్డారు. రుణమాఫీ ప్రక్రియ చాలా మంది రైతులకు అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు.



# కేసీఆర్ హయాంలోనే.. ఉమ్మడి జిల్లా రైతులకు లబ్ధి

- మొత్తం 5.77 లక్షల మందికి రూ.2,518 కోట్లు మాఫీ చేశాం..
- 94.05 మందికి రూ.459 కోట్లు మాత్రమే మాఫీచేసిన కాంగ్రెస్ సర్కార్
- తక్కువ మందికి రుణమాఫీ చేసినందుకు సంబురాలు చేసుకోవాలా?
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మాజీ మంత్రి వేముల ఆగ్రహం



నిజామాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. తక్కువ మందికి రుణమాఫీ చేసినందుకు సంబురాలు చేసుకోవాలా? అని ప్రశ్నించారు. గురువారం వేముల ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూరినట్లు తెలిపారు. ఎవరెక్కువ చేశారు? ఎవరెక్కువ మందికి రుణమాఫీ ప్రయోజనం కల్పించారో? లెక్కలు చూడాలంటూ సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రభుత్వంలో 2016లో మొదటిసారి లక్షలోపు రుణాలు కలిగి ఉన్న 3లక్షల 79వేల 520 మంది రైతులకు రూ.1576 కోట్లు రుణమాఫీని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చేసినట్లు తెలిపారు. 2018లో రెండోసారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షలోపు రుణాలను లక్షా 95వేల 657 మంది రైతులకు రూ.942 కోట్లు రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. రెండుసార్లు కలిపి లక్షలోపు రుణాలను 5లక్షల 75వేల 177 మంది రైతులకు రూ.2,518 కోట్లు మాఫీ చేసినట్లు వివరించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కేవలం 94వేల 566 మంది రైతులకు రూ.459 కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని మండిపడ్డారు. రైతు సంక్షేమం కోసం ప్రపంచంలోనే ఏ రాజకీయ పార్టీ, ఏ రాజకీయ నాయకుడు తలపెట్టని కార్యక్రమాలను కేసీఆర్ చేసి చూపించారని తెలిపారు. 60 ఏండ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ రైతుబంధు, రైతుబీమా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

**అడుగడుగునా కొర్రీలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వానకాలం సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.7500 చొప్పున రైతుభరోసా ఇవ్వాల్సి ఉండగా రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి ఆ డబ్బులతో రుణమాఫీ కింద రూ.6098 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఏదో ఘనకార్యం చేసినట్లుగా గ్లోబెల్స్ ప్రచారాన్ని కాంగ్రెస్ చేస్తుండడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఈ మోసానికి రైతులు సంబురాలు చేసుకోవాలా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రం మొత్తం రుణమాఫీని 37లక్షల మంది రైతులకు వర్తింపజేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు, లోన్ రీషెడ్యూల్, ఆదాయ పన్ను పేరిట కొర్రీలు పెట్టి 26లక్షల మంది రైతులను ఏరి పారేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు కేవలం 11లక్షల మంది రైతులకు కుదించి రుణమాఫీ అమలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ సహాయం కొండంత అయితే రేవంత్ రెడ్డి సాయం పిడికెడంత మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకుంటున్న దుష్ప్రచారాన్ని రైతులు గమనించాలని సూచించారు. ఉద్యోగాలు చేసుకునే రైతు కుటుంబాలు, చిన్న వ్యాపారాలు చేసుకునే రైతులకు కూడా రుణమాఫీ అమలు చేయాలని వేముల డిమాండ్ చేశారు. లేదంటే రైతుల ఆగ్రహావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

### జాబితా గందరగోళంగా ఉంది.



రుణమాఫీకి సంబంధించి అధికారులు ఇచ్చిన జాబితా గందరగోళంగా ఉన్నది. నాకు మూడెకరాల భూమి ఉండగా.. రూ. 99వేల పంట రుణం తీసుకున్న.లక్షలోపు వారికి మాఫీ అని చెప్పారు. కానీ అధికారులు ఇచ్చిన లిస్టులో నా పేరులేదు. రూ. 2 లక్షలలోపు రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు ఎలాంటి నిబంధనలు లేకుండా మాఫీ చేయాలి.

**-గడ్డం సాయిలు, రైతు, బిచ్కుంద**

### నాకు రేషన్‌కార్డు లేదు..



ఆర్మూర్‌టౌన్, జూలై 19: మాది ఆర్మూర్. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులో పంటపై లక్ష రూపాయల రుణం తీసుకున్నా. సీఎం రేవంత్ రెడ్డి లక్ష లోపు రుణం తీసుకున్న వారికి ఒకే దఫాలో మాఫీ చేస్తానని చెప్పిండు. కానీ ఇప్పుడు తెల్ల రేషన్ కార్డు ఉండాలని ఏదేదో అంటున్నరు. నాకు మాత్రం రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదో కూడా అర్థమైతలేదు. ఇప్పటికైనా మాఫీ చేయాలని కోరుతున్న.

**-ప్రమీల, ఆర్మూర్**

### ఎందుకు కాలేదో తెలుస్తలేదు.



నాకు 2.5 ఎకరాల భూమి ఉన్నది.సోయా పంట సాగుకోసం రూ. 55వేల లోన్ తీసుకున్న. కానీ ప్రభుత్వం గురువారం ప్రకటించిన మొదటి జాబితాలో నాకు రుణమాఫీ రాలేదు. తొలి విడుతలో రూ. లక్షలోపు రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రకారం నా లోన్ మాఫీ కావాలి. కానీ ఎందుకు కాలేదో తెలుస్తలేదు.

**- బొల్లి నారాయణ, రైతు, బిచ్కుంద**

### 50వేలు తీసుకున్నా.. జాబితాలో పేరులేదు



నేను రూ.50వేలు పంట రుణం తీసుకున్నా. కానీ నా పేరు జాబితాలో లేదు. ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ఆలోచిస్తున్నా. కొందరి పేర్లు మాత్రమే వచ్చాయి. నాకు రాకపోవడంతో చాలా బాధపడ్డాను. రెండో విడుతలో వస్తాయని చెబుతున్నారు. మాఫీ వస్తదో, రాదోనన్న ఆందోళన ఏర్పడింది.

**- పంచరెడ్డి నరేశ్, రైతు, నిజామాబాద్ రూరల్**

### రుణమాఫీ కాలేదు..



ఆర్మూర్ టౌన్, జూలై 18: నేను 2018లో ఎస్‌బీఐ ఆర్మూర్ బ్రాంచ్‌లో రూ.లక్ష పంట రుణం తీసుకున్నా. అందరితో పాటు నాకు కూడా రుణమాఫీ అవుతుందని అనుకున్నాను. కానీ మాఫీ రాలేదు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. ఒకేసారి రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పిన మాట రేవంత్‌రెడ్డి ఇప్పుడు మార్చారు. అందరిలాగే నాకూ రుణమాఫీ చేయాలి.

**- బద్దం నాగరాజ్, మగ్గిడి, ఆర్మూర్ మండలం**



# మొన్న బల్లి.. నిన్న పురుగులు

- తెలంగాణ వర్సిటీ హాస్టల్‌లో అధ్వానంగా భోజనం
- అన్నం తినేందుకు భయపడుతున్న విద్యార్థులు

పట్టించుకోని అధికారులు..



అన్నంలో వచ్చిన పురుగు

డిచ్‌పల్లి, జూలై 19: తెలంగాణ యూనివర్సిటీలోని వసతిగృహాల్లో వడ్డిస్తున్న భోజనంలో బల్లులు, పురుగులు ప్రత్యక్షమవుతున్నాయి. అన్నంలో మొన్న బల్లి రాగా, నిన్న పురుగులు వచ్చాయి. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో భోజనం చేసేందుకు విద్యార్థులు వెనుకాడుతున్నారు. జూన్ 21న బాలికల వసతిగృహంలో విద్యార్థులకు అల్పాహారంలో బల్లి వచ్చిన ఘటన మరువక ముందే తాజాగా గురువారం రాత్రి భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థిని ప్లేట్‌లో పురుగులు కనిపించడం కలకలం రేపింది. దీంతో విద్యార్థులంతా అన్నాన్ని బయట పడేసి, పస్తులతో పడుకుండిపోయారు. వందల సంఖ్యలో విద్యార్థినులు ఉండే వసతిగృహంలో వంట చేసే సమయంలో సిబ్బంది జాగ్రత్తలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చీఫ్ వార్డెన్, కేర్‌టేకర్ కిచెన్‌ను సందర్శించి, జాగ్రత్తలు సూచించకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. మరోవైపు, వరుస ఘటనల నేపథ్యంలో రిజిస్ట్రార్ యాదగిరి శుక్రవారం ఉదయం హాస్టల్ పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. తాజా ఉదంతంపై వీసీ ఆదేశాల మేరకు కాలేజీ ప్రిన్సిపాల్ ఆరతి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ అపర్ణ, చీఫ్ వార్డెన్ మహేందర్‌తో త్రిసభ్య కమిటీని నియమించారు. ఐదుగురు సీనియర్ మహిళా ఆచార్యులతో మానిటరింగ్ కమిటీని సైతం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన వంట సామగ్రి, తాజా కూరగాయలను అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే హాస్టల్ సిబ్బందిని తొలగించి, కలెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగే అవుట్ సోర్సింగ్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగిస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు.

### నాణ్యమైన భోజనం అందించాలి



వర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులకు అధికారులు నాణ్యమైన భోజనం అందించాలి. గతంలో అల్పాహారంలో బల్లి రాగా.. తాజాగా గురువారం రాత్రి అన్నంలో పురుగులు వచ్చాయి. దీంతో విద్యార్థులంతా ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

**-జయంతి, టీయూ విద్యార్థిని**

### సిబ్బంది నిర్లక్ష్యంతోనే..



వంట చేసే సమయంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అన్నంలో బల్లులు, పురుగులు వస్తున్నాయి. అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలి. అవసరమైతే ఒక కమిటీ ఏర్పాటు చేసి భోజనం వండే, వడ్డించే సమయంలో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలి.

లేనిపక్షంలో విద్యార్థులందరం ఆందోళన చేస్తాం.

**-శివ, టీయూ విద్యార్థి**

# అభివృద్ధి పనులపై ప్రశ్నించినందుకు నోటీసులు

- సోషల్‌మీడియాలో పోస్టు చేసిన యువకులు
- ఠాణాకు పిలిచి నోటీసులు అందజేసిన పోలీసులు

భీమ్‌గల్, జూలై 19: అభివృద్ధి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని సోషల్ మీడియాలో ప్రశ్నించినందుకు ఠాణాకు పిలిచి నోటీసులు అందజేశారు నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పోలీసులు. అసలేం జరిగిందంటే.. కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన జిల్లాకు చెందిన నేతలకు శుక్రవారం భీమ్‌గల్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో భీమ్‌గల్ పట్టణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నిస్తూ స్థానిక యువకుడు నీలం రవి కొంతమందితో కలిసి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. కార్పొరేషన్ చైర్మన్లుగా పట్టణానికి వస్తున్న ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, అన్వేశ్‌రెడ్డి పనుల పూర్తిపై సన్మాన కార్యక్రమ వేదిక పైనుంచి స్పష్టత ఇవ్వాలని వీడియోలో కోరాడు. ఈ నేపథ్యంలో పోలీసులు రవితో పాటు వీడియోలో ఉన్న కర్నె మహేందర్, కర్నె నరేశ్, రావుట్ల హరీశ్, కర్నె అనిల్, గంగారపు రఘును ఎస్సై హరిబాబు ఠాణాకు తీసుకెళ్లి నోటీసులు జారీ చేశారు. అభివృద్ధి పనులపై ప్రశ్నించినందుకు పోలీసులతో నోటీసులు ఇప్పించడం కాంగ్రెస్ వారికే చెల్లిందని స్థానిక నేతలు మండిపడ్డారు.



భీమ్‌గల్ ఠాణా వద్ద అభివృద్ధిపై ప్రశ్నించిన ఆరుగురు యువకులు

# చనిపోయిందనుకున్న మహిళ లేచి కూర్చుంది

అవాక్కయిన ధర్మాబాద్ పోలీసులు



వృద్ధురాలిని నీటి నుంచి బయటికి తీసుకొస్తున్న జాలర్లు

రెంజల్, జూలై 19: గోదావరి నదిలో ఓ వృద్ధురాలు ఉలుకుపలుకూ లేకుండా కనిపించడంతో చనిపోయిందనుకున్నారు. మృతదేహాన్ని తరలించాలన్న ఉద్దేశ్యంతో పూర్తి సరంజామాతో వచ్చిన మహారాష్ట్ర ధర్మాబాద్ పోలీసులకు ఊహించని షాక్ తగిలింది. వృద్ధురాలిని తరలించేందుకు యత్నించగా, ఆమె ఒక్కసారిగా లేచి కూర్చోవడంతో బిత్తరపోవడం పోలీసుల వంతైంది. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి శివారులోని గోదావరి నది సమీపంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గోదావరి నదిలో స్నానం చేసేందుకు భక్తులు శుక్రవారం కందకుర్తి ఘాట్‌కు వెళ్లారు. అయితే, మహారాష్ట్ర వైపు ఓ మహిళ నీటిలో తేలియాడుతుండడాన్ని గమనించిన భక్తులు 100కు కాల్ చేసి సమాచారమిచ్చారు. దీంతో రెంజల్ ఎస్సై సాయన్న అక్కడికి చేరుకుని పరిశీలించగా, మహిళ ఉన్న ప్రదేశం మహారాష్ట్ర పరిధిలోకి వస్తుందని గుర్తించి, ధర్మాబాద్ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో అక్కడి పోలీసులు మృతదేహాన్ని తరలించేందుకు ఆటో, గజ ఈతగాళ్లతో గోదావరి వద్దకు చేరుకున్నారు. జాలర్లు, కానిస్టేబుల్ సదరు మహిళ చేయి పట్టుకోగా, ఆమె ఒక్కసారిగా లేచి కూర్చోవడంతో వారు అవాక్కయ్యారు. వృద్ధురాలిని బయటికి తీసుకొచ్చి విచారించగా, ధర్మాబాద్ తాలుకా యాతాలం గ్రామ వాసిగా గుర్తించారు. కొడుకు, కోడలితో గొడవ పడి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లుగా గ్రహించిన ధర్మాబాద్ పోలీసులు.. కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి వృద్ధురాలిని అప్పగించారు.


